1993 నుంచి 2013 వరకు వెలువడిన **నడుస్తున్న చరిత్ర** కు నేటి రూపం

సంపుటి : 5
సంచిక : 9
పుటలు : 52

రు. 20 లు

తెనాలి

తెలుగుజాతి పత్రిక

# అమ్మనుడి

నుడి నాడు నెనరు

నవంబరు 2019





నాణేలనే ప్రాణంగా భావించి
నాణ్యశాస్త్ర జ్ఞానాన్ని ప్రేమించి
86 ఏళ్ల వయసులో
అక్టోబర్ 6న కాలధర్మం చెందారు
'నాణేల రాజు'గారు

- మాతృభాషల మౌనపోరాటం.
- తెలుగు రాష్ట్రాల్లో తెలుగుకు కొరివి పెట్టడమే మిగిలింది!
- కవితాపయోనిధి దాశరథి
- రామాలయ నిర్మాణం సయోధ్యను కలిగిస్తుందా?

మాతృభాషలకు పెద్దపీట వేసిన జాతీయ నూతన విద్యావిధానం

◆ తెలుగు అభివృద్ధి, సాధికారతల కోసం...
◆ తెలుగు భాషోద్యమ నిర్మాణం కోసం...
◆ ఆంధ్ర, తెలంగాణ, ఇతర రాష్ట్రాలు, విదేశాల్లోనూ ఉన్న తెలుగువారి కోసం...

తెలుగుజాతి పత్రిక

# అమ్మనుడి

సంపాదకుడు : డా॥ సామల రమేష్‌బాబు 9848016136

తోడ్పాటు : డా॥ గారపాటి ఉమామహేశ్వరరావు, డా॥ వెన్నిసెట్టి సింగారావు, డా॥ సుందర్ కొంపల్లి, రహ్మానుద్దీన్ షేక్, సరస్వతుల రామనరసింహం(సరసి), తమ్మా శ్రీనివాసరెడ్డి




**నవంబరు 2019**

### రచయితలకు సూచనలు

తెలుగు భాష, సాహిత్యం,సాంస్కృతికతలతో పాటు తెలుగువారి చరిత్రకూ, సంస్కృతికీ, సాధికారతకూ, ప్రగతికీ చెందిన సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలపై రచనలకు స్వాగతం. వ్యాసం, కథ, వచన కవిత, పాట –రచనను ఏ రూపంలోనైనా పంపవచ్చు.

1. వ్యాసాలు ముద్రణలో 1 నుండి 3 పుటలకు మించకూడదు. కథ 3 పుటలకు మించకూడదు. కవితలు 20 నుంచి 30 పంక్తులకు మించకూడదు. విమర్శలు విషయం పైనే ఉండాలి గాని వ్యక్తులపై గురిపెట్టి చేయరాదు. సరళమైన తెలుగులో వ్రాయాలి.

2. రచనలను యూనికోడ్‌లో గాని, అనుఫాంట్స్‌లో గాని టైప్ చేసి పి.డి.ఎఫ్ మరియు పి.ఎం.డి. రెండింటిలోనూ పంపాలి. లేదా ఎ4 సైజు కాగితంపై వ్రాసి, స్కాన్ చేసి *editorammanudi@gmail.com* కు పంపాలి. కొరియర్ / రిజిష్టర్డ్ / సాధారణ పోస్టులో కూడా పంపవచ్చు.

3. రచనతో పాటు పోస్టల్ చిరునామా, ఫోన్ నంబరు, ఉంటే ఇ–మెయిల్ చిరునామా కూడా ఇవ్వాలి. ఈ వివరాలు లేని రచనల్ని తీసుకోలేము.

4. రచన స్వంతమేనని, ఇతర పత్రికలకుగాని, ఇంటర్నెట్ పత్రికలకుగాని పంపలేదని, ఇంతవరకు ఎక్కడా ప్రచురణ కాలేదని హామీ పత్రాన్ని తప్పనిసరిగ పంపాలి. ముందుగా సోషల్ మీడియాలో పెట్టిన రచనలను ప్రచురణకు స్వీకరించ లేము.

వలగూడు (ఇంటర్నెట్)లో *www.ammanudi.org* చూడండి.

### లోపలి పుటలలో....


| | | | |
|---|---|---|---|
| సంపాదక హృదయం: | మాతృభాషలకు పెద్దపీట వేసిన.... | | 05 |
| మాతృభాషలు : | మాతృభాషల... | ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు | 07 |
| సంప్రదాయం : | విద్య, వైద్యం, ఉపాధి.... | డా.పి.శివరామకృష్ణ 'శక్తి' | 10 |
| తెలుగు రాష్ట్రాలు : | తెలుగుభాషా...నీకు... | ప్రొ.పులికొండ సుబ్బాచారి | 11 |
| ముందడుగు : | హైదరాబాదు పాతబస్తీలో... | రహ్మానుద్దీన్ షేక్ | 14 |
| పెద్దోరి తీపిగురుతులు : | నాణేల సేకరణ తపస్సులో... | సన్నిధానం నరసింహశర్మ | 15 |
| స్మృతి | కవితాపయోనిధి – దాశరథి... | డా॥.పాపినేని శివశంకర్ | 18 |
| తిరగమోత : | కాలజ్ఞానం అందేదెన్నడు... | సడ్లపల్లె చిదంబరరెడ్డి | 23 |
| వారసత్వ సంపద: | రామప్ప గుడులకు... | సంకేపల్లి నాగేంద్రశర్మ | 29 |
| ప్రాచీన భాష | ప్రాచీన తెలుగు... | కస్తూరి విశ్వనాథం | 31 |
| పిట్టచూపు : | రామాలయ నిర్మాణం.... | చలసాని నరేంద్ర | 32 |
| చారిత్రక సాహిత్యం: | చర్యాపదాలు – ఒక.... | రాజేంద్రసింగ్ బైస్ ఠాకూర్ | 44 |
| పుస్తక సమీక్షలు: | | ఈమని శివనాగిరెడ్డి, ఎం.వి.శాస్త్రి | 49 |
| గ్రంథాలయం : | | | 50 |
| కథానిక : | మందార మకరందాలు | దాసరి శివకుమారి | 45 |
| నవల : | జగమునేలిన తెలుగు– 3 | డి.పి.అనూరాధ | 24 |
| ధారావాహికలు : | సొతంత్రకాల సదువులు–6 | నంద్యాల నారాయణరెడ్డి | 34 |
| | జోగిని మంజమ్మ ఆత్మకథ | రంగనాథ రామచంద్రరావు | 38 |
| కవిత : | నిరూపణ | ఎస్.కాశింబీ | 17 |



రేఖాచిత్రాలు, పావులూరి చిదంబరేశ్వరరావు

కార్టూన్లు 'సరసి'

కంప్యూటరీకరణ లంకె జనార్దన్


'అమ్మనుడి'లో ప్రచురణకై వార్తలు, ఫోటోలు, రచనలను కొందరు వాట్సప్ (WhatsApp) లో పంపుతున్నారు. వాటిని ప్రచురణకు స్వీకరించలేము. దయచేసి కొరియర్‌లో / రిజిస్టర్ట్ పోస్టులో, లేదా **editorammanudi@gmail.com** కు పంపించండి. – సంపాదకుడు


రచనలు, ఉత్తరాలు పంపుటకు చిరునామా:

సంపాదకుడు: **అమ్మనుడి**, జి–2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ, హిందీ కళాశాల వీధి, మాచవరం,విజయవాడ–520004.

కార్యాలయం : *0866-2439466* సంపాదకుడు : *9848016136* *e-mail* : editorammanudi@gmail.com



రచయితల అభిప్రాయాలు వారి స్వంతం. వారితో పత్రిక యాజమాన్యం, సంపాదకుడు ఏకీభవించవలసిన అవసరం లేదు.

ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు
9866128846

# మాతృభాషల మౌనపోరాటం

భారతదేశం నిజంగా యువభారతమే. ఇందులో 25 ఏళ్లు దాటనివారు 46% కాగా 50 ఏళ్లు దాటనివారు 88%. సమాజంలో ప్రతివారి హక్కులను గుర్తించి మెలగడం, పెద్దలపట్లా తల్లిదండ్రులూ గురువుల పట్లా గౌరవం; స్త్రీలూ, పేదలూ, పిన్నలపట్ల ఆదరణా ఉండటం మానవీయ విలువలలో అన్నిటికంటే ప్రధానమైనది. వీటికి చిన్నప్పటినుంచీ తల్లి ఒడిలో మొదలై, బడిలోనూ ఆ పైవరకూ మాతృభాషలో నేర్చుకున్న సాహిత్యమే ఆధారం.

భారతదేశంలో 2.3 లక్షలమందికి ఇంగ్లీషు ప్రాథమిక భాష. ఐతే షుమారు 8.5 కోట్లమందికి రెండవ భాషగానూ ఇంకొక 4 కోట్ల మందికి మూడవ భాషగానూ ఉంది. ఈ వివరాలు మన జనాభా లెక్కలలో ఎవరికివారు చెప్పుకున్నవే. వీటికి ఎలాంటి సాధికారత లేదు. ఇలా ఇంగ్లీషు తెలుసని చెప్పుకున్నవారు ప్రధానంగా నగరాలకే పరిమితం. ఐతే, మన జనాభాలో 65% మంది భారతీయులు గ్రామాలలోనే నివసిస్తున్నారనేది నిజం. భారతీయ అంతర్జాల వాడుకరులలో 70% మంది నగరాలలో ఉండగా, 30 % మంది మాత్రమే గ్రామీణ భారతానికి చెందినవారు. వీరిలో సగంమందిపైగా చరవాణిలో అంతర్జాలాన్ని వాడేవారే. 75% అంతర్జాల వినియోగదారులు భారతదేశంలో వారి స్థానిక భాషల్లో అంతర్జాలాన్ని చూడటానికి ఇష్టపడుతున్నారని అంతర్జాల వినియోగదారుల సంస్థ సర్వేక్షణలో తేలింది. భారతీయ భాషల మాధ్యమం అవసరాన్ని ఇప్పుడు ఎక్కువగా గుర్తించాల్సిన సమయం వచ్చింది.

దేశంలో అంతర్జాల వినియోగం పట్టు బిగుస్తున్నా, యువత మాతృభాషల నుండి దూరం కావడంలేదు అని అనేక నివేదికల ద్వారా తెలుస్తోంది. దాదాపు 42% మందివరకూ స్థానిక భాషల్లో అంతర్జాలాన్ని శోధించడానికి ఇష్టపడతున్నారని ఒక సర్వేక్షణలో తేలింది. స్థానిక భాషల్లో విషయాలు మరింత అందుబాటులోకి వస్తే, మరింతమంది వినియోగదారులు అంతర్జాలాన్ని ఉపయోగించడం మొదలు పెడతారు.

అంతర్జాల చరవాణి వాడుకరుల సంఘంవారి ప్రకారం–అంతర్జాల సర్వేలో కనుగొన్న విషయం ఏమంటే,–గ్రామీణ జనాభాకు ఆంగ్ల మాధ్యమంలో అంతర్జాల సమాచారప్రాప్తి చాలా అసౌకర్యంగా ఉంది. ఈ అశక్తత, అసమర్థత వలన అంతర్జాలాన్ని వినోదం కోసం కాక, ఇతర ప్రయోజనాల కోసం పూర్తిగా ఉపయోగించలేక పోతున్నామని పేర్కొన్నారు.

### భారతీయ భాషలకు పెరుగుతున్న ఆదరణ:

డిజిటల్ మాధ్యమ సంస్థలు ఎక్కువగా హిందీ ఇంకా ఇతర భారతీయ భాషలలో వారి సాంఖ్యిక విషయాలను అందించడం ప్రారంభించాయి. గత కొద్ది ఏండ్లుగా, అంతర్జాల, డిజిటల్, వినోద మాధ్యమాలలో భారతీయ భాషా వినియోగదారుల పెరుగుదల ఆకర్షణీయంగా ఉంది. ఈ మధ్యనే అనేక సంస్థలు జరిపిన సర్వేక్షణల

ఇక తెలుగురాష్ట్రాల సంగతి సరేసరి. ప్రభుత్వాలు మాత్రం తెలుగును పట్టించుకోవడం మానివేశాయి. తెలుగు మాధ్యమం స్థానే ఇంగ్లీషు మాధ్యమాన్ని ప్రవేశపెట్టేశాయి. తెలుగు మాధ్యమాన్ని తొలగించి ఇంగ్లీషు మాధ్యమాన్ని ప్రవేశపెడితే వచ్చే అనర్థాలు ఎన్నో. స్థానిక భాషాధార పరిశ్రమలన్నీ ఎన్నో వచ్చే రెండు దశాబ్దాలలో మూలబడటం ఖాయం. ఈ సర్వేల గణాంకాలను చూసైనా ప్రభుత్వాలు భాషా విషయంలో పునరాలోచనలో పడాలి.

ఆధారంగా, భారతీయ భాషల వినియోగం అన్ని అంతర్జాలమాధ్యమ రంగాలలోనూ పెరుగుతోందనీ, ప్రభుత్వాలు మాత్రం భాషలకు సంబంధించి ఈ సర్వేలను పట్టించుకోవడంలేదనీ తెలుస్తోంది.

ఇక తెలుగురాష్ట్రాల సంగతి సరేసరి. ప్రభుత్వాలు మాత్రం తెలుగును పట్టించుకోవడం మానివేశాయి. తెలుగు మాధ్యమం స్థానే ఇంగ్లీషు మాధ్యమాన్ని ప్రవేశపెట్టేశాయి. తెలుగు మాధ్యమాన్ని తొలగించి ఇంగ్లీషు మాధ్యమాన్ని ప్రవేశపెడితే వచ్చే అనర్థాలు ఎన్నో. స్థానిక భాషాధార పరిశ్రమలన్నీ ఎన్నో వచ్చే రెండు దశాబ్దాలలో మూలబడటం ఖాయం. ఈ సర్వేల గణాంకాలను చూసైనా ప్రభుత్వాలు భాషా విషయంలో పునరాలోచనలో పడాలి.

### వినోద మాధ్యమాల పరిశ్రమ:

అతిచౌకగా వాడుకలోకి వస్తున్న స్మార్ట్‌ఫోన్‌ల ద్వారా పెరుగుతున్న డిజిటల్ వినియోగ రంగంలో ఉరకలేస్తున్న భారతదేశంలో వినోద మాధ్యమాల పరిశ్రమ 2024 ఆర్థిక సంవత్సరం నాటికి రూ. 3.77 లక్షల కోట్లకు చేరుకుంటుందని ఓ సరికొత్త నివేదిక తెలుపుతోంది. 'భారతదేశంలో డిజిటల్ భవిష్యత్తు' అనే నివేదిక (కేపీఎంజీ) ప్రకారం, 2019 ఆర్థిక సంవత్సరంలో వినోద మాధ్యమాల పరిశ్రమ 13 శాతం ఘన వృద్ధిని సాధించి, 11.5 శాతం వార్షిక చక్రవృద్ధి రేటు (సిఏజీఆర్) తో రూ.1.6 లక్షల కోట్లకు చేరుకుంది. పెద్ద నిర్బంధాలు ఏమీ లేనందున, డిజిటల్ ఆధార పరిశ్రమలు ఆధిపత్య శక్తులుగా ముందుకు సాగుతాయని భావిస్తున్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో, టీవీ తరువాత రెండవ అతిపెద్ద విభాగంగా అవతరిస్తుందనీ ఇంకా అన్నిరకాల మాధ్యమ రూపకాలతో అత్యధిక మార్కెటింగ్ వ్యయాన్ని ఆకర్షిస్తుందని భారతదేశంలోని వినోద మాధ్యమాల సాంవత్సరిక నివేదిక తన ప్రకటనలో తెలిపింది.

### ప్రాంతీయ భాషలలో డిజిటల్ సమాచారంలో పెట్టుబడులు:

డిజిటల్ సమాచార తయారీలోనూ పంపిణీలోనూ ఇంకా ఆ సమాచార వాడకంలోనూ అన్నిటికీ అనుకూలమైన అంశాలే ఉన్నాయి. ఇవన్నీ కలిసి ప్రాంతీయభాషలలో అంతర్జాల ఆధారిత సమాచార వినియోగాన్ని పెంచుతున్నాయి. ప్రాంతీయ భాషలలో సమాచార

డా|| పి.శివరామకృష్ణ 'శక్తి'
9441427977

# విద్య, వైద్యం, ఉపాధి, మీడియా మాయలు

*"పెరుగుట విరుగుట కొరకే -*
*పరిపూర్ణ సుఖంబు లధిక బాధల కొరకే".*

తెల్లవాళ్ళ పెత్తనానికి ముందు శిష్ట, మాండలిక భాషలు ఒకటి కొకటి సన్నిహితంగా చలామణి అవుతుండేవి. అచ్చుయంత్రం, పత్రికలు, సార్వత్రిక విద్యలతో ప్రామాణిక భాష బలపడసాగింది. ఈ చదువులు ఉద్యోగాలు కలిసి సంప్రదాయ వృత్తులను తొక్కేసి, విదేశీ ఉత్పత్తులను దిగుమతి చేయసాగాయి. ఆట పాటలు, కథలు వినడం మానేసి, నవలలు చదువుకోటం వాదోపవాదాలతో పత్రికలు హోరె త్తించటం అలవాటైంది.

ఒక 'జాతీయ' సేవాసంస్థ తెలంగాణా విద్య, వైద్య, ఉపాధి రంగాలలో జరుగుతున్న కృషిని ప్రదర్శించింది.

ప్రభుత్వ పాఠశాలలలో విద్యాప్రమాణాలను పెంచే కృషిలో తాము కనిపెట్టిన కొత్తబాటలను కొందరు చాటుకొన్నారు. పిల్లలు లెక్కలలో 'వీక్' గా ఉన్నారు, వారికి తాము బోధించే తీరు మంచి ఫలితాలు సాధించటమే కాదు, పరిశోధకుల మన్ననలు పొందింది అని చెప్పుకొచ్చారు.

గ్రామంలో వృత్తి పనివాళ్ళు అనేక పరికరాలు, సారామట్టం, వడంబం, టేప్, గజం బద్ద, వంటి పరికరాలను వాడుతూ లెక్కలు కడుతూ, తూస్తూ - కొలుస్తూ ఉంటారు...ఒకప్పుడు వీధిబడిలో చదవటం,రాయటం,లెక్కలు, అమరం, ఆంధ్ర నామసంగ్రహం, తిథి వార నక్షత్రాలు సార్వత్రిక విద్య కాగా, ఆయా వృత్తులకు కావలసిన 'లెక్కాచారం' కుటుంబంలోనో, గురువు దగ్గరో నేర్చుకునే వారు. కుటుంబంలో నవశేష్ అనే లెక్కించే పద్ధతి నేర్చుకున్న ఒక మార్వాడి విద్యార్థి, బడిలో రాణించినట్లు చెన్నై ఐ.ఐ.టి లో లెక్కల ఆచార్యుడు (అశోక్ ఝున్ ఝున్ వాలా) స్వయంగా చాటుకున్నాడు. ఇటువంటి పద్ధతితో అన్ని వర్గాలను కలుపుకు పోవాలి. కానీ మా పరిశోధనలు, రాంకులు తెచ్చాయని దబాయింపులు. ఈ 'మెరిటోక్రసి' తోముడులో కొంతమందికి రాంక్ రావచ్చుకాని, బడి మానేసేవారి సంఖ్య పెరుగుతుంది..సంప్రదాయ పద్ధతి ఏదో మూల, అదికూడా ఉంది అని చెప్పుకోటానికి, నామమాత్రంగా నడుస్తుంది...ఈవేళ లెక్క చేయాలంటే కాలికులేటర్ కావాలి. అర్థాలు కావాలంటే నిఘంటువు వెతకాలి. ధారణశక్తి క్షీణిస్తుంది.

ఇటీవలవరకు మంత్రసాని వ్యవస్థ బలంగా ఉండేది. కానీ ఆస్పత్రి కాన్పు ప్రభుత్వ విధానమయింది. ఉచిత మెడికల్ కాంపుల పేరిట సేవ చేస్తున్నారు..ఈ ముట్టుకుని మాయమయ్యే (టచ్, వానిష్) సేవల ఫలితాలమీద అంచనాలు ఏమీలేవు. ఉద్యోగాలూ అంతే. ఎంతమందికి శిక్షణ ఇస్తే, ఎంతమంది పనిలో చేరారు, ఎంతమంది కొనసాగు తున్నారు?.

ఎందుకు, ఏ వర్గం వారు మానేసారు. వారికి పునశ్చరణ తరగతులు నిర్వహించాలా? ఈ వివరాలు ఎవరిదగ్గరా లేవు.

దేశీయ సంప్రదాయాన్ని పక్కకు నెట్టటంతోపాటు, సంస్కృతం, హిందీ నేర్చుకోండి అని ప్రత్యక్షంగా పరోక్షంగా వత్తిడి పెంచుతు న్నారు. చాత్రవాస్ (హాస్టల్) లలో శ్లోకాలు,జయ జగదీశ హరే హార తులు,హనుమాన్ చాలీసాలు వల్లె వేయిస్తారు. 'అమ్మల గన్న యమ్మ, ఎవ్వనిచే జనించు,తొండము నేకదంతమును - బ్రహ్మ మొక్కటే పరబ్రహ్మ మొక్కటే' వంటి పద్యాలు, కీర్తనలు వినిపించవు. లెజిమ్స్ (యోగచాప్) కు తప్ప కోలాటానికి చోటులేదు. ఒకప్పుడు ఇతిహాస సంకలన సమితి ద్వారా 1935 నుండి వెనుకకు చరిత్ర పునర్నిర్మిద్దాం అని పిలుపు నిచ్చారు. ఇప్పుడు అటునుండి అంటే వెనుకనుండి వెతుకుదాం అంటున్నారు. 'యోగ', వేద గణితం (మాథమాటిక్స్) సంస్కారం, ఇలా పాఠాలు కార్పోరేట్ లెవెల్లో మార్మోగుతున్నాయి..

మీడియా విషయానికొస్తే తెల్లవాడి చదువుకు ఉద్యోగం పర మావధి. అక్కడ గొడ్డులా పనిచేయటం తప్ప, కలలు గనే, ప్రశ్నించే అవకాశం లేని మధ్య తరగతి, సాహిత్యం ద్వారా కుతి తీర్చుకో సాగింది. సమష్టి సృజనాత్మకత బదులు వ్యక్తి, ఆధిపత్య ధోరణులు పెరిగినాయి. ఈ ధోరణులవల్ల వచ్చే నష్టాలను, ఆ అవకాశం ఇంకోడి కివ్వటం ఎందుకు, అని ఒక పక్క ఏకరువు పెడుతూనే, కుక్కతోక వంకర అంటూ ఆ దారినే పోతుంటారు, కార్పోరేట్ సేవ చేస్తుంటారు. జాతీయతకు కొత్త భాష్యాలు చెపుతుంటారు. ఈ మిడిసిపాటు అట్టే రోజులు సాగదు.అంతవరకు, సంప్రదాయంలో సమష్టి జ్ఞానాన్ని ముందుతరాలకు అందించే దేశ భాషలను కాపాడుకోవటమే ప్రస్తుత కర్తవ్యం.

తెలియని భాషలో ఏమీ చెప్పలేక చేయలేక ఇంగ్లీషు వచ్చినవారికి డబ్బిచ్చి ఇంగ్లీషులో మాట్లాడించడం రాయించడం చేయించు కోవల సిన అగత్యం ఏర్పడుతుంది.

**మానవీయ విలువలకు హాని:**

తెలుగులో మానవీయ విలువలు గురించి చదవడం, రాయడం, పునశ్చరణ, చర్చించడం నశించడంతో విద్యార్థులూ, ఉపాధ్యాయులూ, తల్లిదండ్రులూ మిగిలిన సమాజం మొత్తంపై దీని ప్రభావం పడుతుంది. ఇది మనలో సహనం నశించడానికి దారి తీస్తుంది, ఇంకా ఎంతకాలం ఈ ఓర్పు? భరించలేని కష్టకాలపుటంచు లకు చేరిన జీవితాలు!. రాజకీయుల శుష్కవచనాలు ఖాళీ పొట్టలను నింపలేవు గదా!.

ఉన్నవాటినికూడా పీకెయ్యడం దారుణం. అదుక్కు తినేం దుకు కూడా వీలులేకుండా చేస్తుంది ఈ ఇంగ్లీషు మీడియం. అన్ని రకాలుగా వంచితులై, బ్రతుకే భారమై, బ్రతక లేక చావలేక, ఏమి చేయాలో పాలుపోక ఆశా నిరాశల మధ్య అలిసిపోయి నిస్పృహతో ఆత్మ హత్యలూ, హత్యలే శరణ్యం ఇక.

అ

ఆచార్య పులికొండ సుబ్బాచారి
9440493604

# తెలుగుభాషా.. నీకు కుండబద్దలు కొట్టారు, ఇక కొరివి పెట్టడమే మిగిలింది

ఏలినవారు తెలుగుపట్ల తీసుకోవలసిన నిర్ణయాలపైన దోబు చులాడుతూ వస్తున్నారు. ఏదో మేలు జరుగుతుందని రెండు రాష్ట్రాలు ఏర్పడిన దగ్గరనుండీ తెలుగు ప్రజలు ఎదురు చూస్తున్నారు. తెలుగు భాషకు మంచి రోజులు వస్తాయని ప్రజలు ఆశపడుతున్నారు. ఈ దోబూచులాట అంతమైంది.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కుండ బద్దలుకొట్టింది. ఇక పైన అన్నీ ఇంగ్లీషు మీడియం పాఠశాలలే ఉంటాయని వాటిలో తెలుగు ఒక భాషగా ఉంటుందని ఇక పైన పాఠశాలలలో తెలుగులో చెప్పే వారికి ఇంగ్లీషులో చెప్పడంలో ఆరు నెలల పాటు శిక్షణ ఇప్పిస్తామని ప్రభుత్వం స్పష్టంగా కుండ బద్దలుకొట్టింది. ఇక్కడ నేను కుండబద్దలు కొట్టిందని సరైన ఉద్దేశం తోనే అన్నాను. మన ఆచారాల ప్రకారం ఒక వ్యక్తిని కాష్టం మీద పెట్టి, వారసుడు కొరివి పెట్టే ముందే, కుండబద్దలు కొట్టిస్తారు. తర్వాత కొరివి పెడతాడు. తెలుగును కాష్టం మీద పెట్టారు. కుండబద్దలు కొట్టారు. ఇక మిగిలి ఉన్నది కొరివి పెట్టి పూర్తిగా తగులబెట్టడమే. వారు చెప్పిన ఇంగ్లీషు మీడియం పాఠశాలలు వస్తే కొరివిపెట్టి కాల్చడం పూర్తి అవుతుంది.

తెలంగాణ రాష్ట్రంలో కూడా తెలుగు పరిస్థితి పైన తొలి రోజుల్లో చాలా ఆశ కలిగింది. పాఠశాల స్థాయి వరకు తెలుగు తప్పని సరిగా ఉంటుంది అని చెప్పారు. బోధనభాషగా ఉంటుందని నాలాంటి వారు చాలా మంది ఆశపడిన మాట వాస్తవం. ఇక ప్రపంచ తెలుగు మహాసభలు నాలుగేండ్ల క్రితం హైదరాబాదులో జరిగినప్పుడు తెలుగుకు మంచి రోజులు వస్తాయని ఆశ పడిన రోజులు ఇంకా బాగా గుర్తున్నాయి. వీరు కూడ కొత్త జీవోలు తెచ్చారు.

తెలుగు తప్పనిసరిగా ఒక భాషగా అన్ని పాఠశాలల్లో ఉండాలి అని కృషి చేశారు. కొత్త పాఠ్య గ్రంథాలు వేరు వేరు ప్రథమ భాషల వారికి చేయించారు. కేంద్రీయ విద్యాలయాల వారితో కూడా తెలుగును తప్పనిసరిగా పెట్టేవిషయంలో మంచిచర్చ చేశారు. కొన్ని సమస్యలను అధిగమించడానికి కూడా పనిచేశారు. ఇంతవరకు మెచ్చదగిన విషయమే.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పాఠశాలలను ప్రైవేటు వారు పెట్టడా నికి అనుమతించడం దాదాపు నాలుగు దశాబ్దాల క్రితమే మొదలైంది. కాని అప్పుడు ధార్మిక సంస్థలు, ట్రస్టులు ఒక పవిత్ర ఆశయంతో విద్యావ్యాప్తికి కృషి చేయాలని పెట్టారు.

విశాలమైన స్థలంలో మంచి వనరులతో వీటిని మొదలు పెట్టారు. అలాంటి కొన్ని పాఠశాలలకు ప్రభుత్వం గ్రాంటులు కూడా ఇచ్చి, ఎయిడెడ్ విద్యాసంస్థలుగా చేసింది. ఇక రెండున్నర దశాబ్దాల క్రితం వ్యాపారవర్గాలు చదువు వైపు దృష్టి పెట్టాయి.

> తెలుగు మీడియంలో చదువుకుంటే ఉద్యోగాలు రావు అనే మాట కేవలం విద్యావ్యాపారులు ప్రచారం చేసిన ఒక తప్పుడు వ్యాపార నినాదం. ఇది నిజం కాదు. తెలుగు రాష్ట్రాలలో 13,00,000 అక్షరాలా పదమూడు లక్షల ఉద్యోగాలు ఉన్నాయి. ఈ పదమూడు లక్షల మంది ఉద్యోగులు తొమ్మిది కోట్ల తెలుగువారికి సేవలు చేయాలి అంటే ఉద్యోగంలో వారు రాసేది తెలుగులో ఉంటే సరి పోతుంది. పదమూడు లక్షలమంది తొమ్మిదికోట్ల తెలుగు వారికి తెలుగులోనే సేవచేయడానికి పరిపాలన అంతా తెలుగులోనే ఉంటే ఈ ఉద్యోగులు తెలుగులోనే పనిచేస్తారు. దీనికి తెలుగు మీడియంలో చదువుకున్నవారే అవసరం అవుతారు.

రిస్కులు లేకుండా వ్యాపారానికి పనికి వచ్చేవి, పాడి కుండ లాగా ఆదాయాన్ని తెచ్చేవి విద్యాసంస్థలే, అనే రహస్యాన్ని వారు గ్రహించిన తర్వాత, ఆ రంగంలో బాగా పెట్టుబడి పెట్టి, ఇబ్బడి ముబ్బడిగా ఆదాయం సాధించే సులువు కనిపెట్టారు. ఈ క్రమంలోనే ఇంగ్లీషు మీడియం మీ భవిష్యత్తును బంగారం చేస్తుంది అనే నినాదంతో వారి వ్యాపారం మూడు పూవులు ఆరు కాయలు అవుతుందని గ్రహిం చారు. ఇక వెనక్కు తిరిగి చూడలేదు.

తొలిరోజుల్లో ఒక ప్రైవేటు పాఠశాలకు అనుమతిని ఇవ్వాలంటే కనీసం ఐదు ఎకరాల సొంత భూమి ఉండాలి. మంచి భవనాలు ఉండాలి. అవి బడి పెట్టే సొసైటీ వారి సొంతానివి అని పత్రాలు చూపించాలి. ఇక కళాశాల పెట్టాలి అంటే కనీసం 25 ఎకరాల స్థలం ఉండాలి ఇన్ని వనరులూ ఉండాలి అనే నియమాలు ఉండేవి. అవి తప్పనిసరి నియమాలుగా ఉండేవి.

ఈ రంగంలో వ్యాపారస్తులు పెరిగి వారిలో రాజకీయ నాయ కులు, ప్రభుత్వంలో పలుకుబడి పెరిగిన నాయకులు చేరడంతో– ఈ నియమాలు సడలి పోయాయి. ఇక డిగ్రీ, పిజీ కాలేజి కూడా రోడ్డు పక్కన అపార్ట్‌మెంటు గదుల్లో ట్రాఫిక్ రణగొణ ధ్వనుల మధ్య నేడు నడుస్తున్నాయి. అలా పెట్టుకోవడానికి కూడా ఏలినవారు ఉదారహృదయంతో అనుమతులు ఇస్తూ, విద్యాసేవ చేస్తున్నారు. నేడు పాఠశాల పెట్టాలన్నా, కళాశాల పెట్టాలన్నా ఎంత తేలికగా ఎక్కడైనా పెట్టడానికి వీలవుతుందో – నేడున్న పాఠశాలలను చూస్తే

సన్నిధానం నరసింహశర్మ
9292055531

## నాణేల సేకరణ తపస్సులో జీవితాన్ని పునీతం చేసుకున్న కీర్తిశేషుడు

# పేరిచర్ల సూర్యనారాయణరాజు గారు

చాలానాళ్ళ క్రింద – కాదు, చాలా ఏళ్ళ క్రిందట ఓ రోజున శ్రీ గౌతమీ గ్రంథాలయానికి ఓ ఫారెస్టు చెకింగ్ ఆఫీసరు వచ్చారు. గ్రంథాలయం అంటే సాంస్కృతిక మానవుల జ్ఞాన సంచలనాలుగా ఉండే రోజులవి. పరిచయాల పరిమళాలు, పలకరింపులు, జ్ఞానాం శాల పంపకాల్లో పులకరింపులూ వుండేవి. గ్రంథాలయ కార్యదర్శి, రచయిత మహీధర జగన్మోహనరావుగారికి తపాలా బిళ్ళల సేకరణ వ్యసనంగా ఉండేది. ఆయన తీసుకురాగా ఆ అటవీ శాఖాధికారి వచ్చారు. నాకూ, కవి కొత్తపల్లి సత్యశ్రీమన్నారాయణకు, బౌద్ధ గ్రంథాలను మథించే దినచర్య వుండే ఇమంది రామకృష్ణదాస్‌కు, వోయిస్ ఆఫ్ అమెరికా కార్యక్రమాలు వినడంలో అమెరికా రాయబార కార్యాలయంచే గౌరవింపబడిన వితలా రాఘవరావుకు (తరువాత కాలంలో ఈయన స్పెయిన్ రాయబారి కార్యాలయంలో ఉద్యోగించారు) ఆ కాకీ దుస్తుల్లో ఉన్న ఆ అధికారిని చూపిస్తూ 'ఈయన పేరు పేరిచర్ల సూర్యనారాయణరాజు, ఈయన మన ప్రాచీన కాలం నాటి నాణేలను ఎన్నో సేకరించారు. ఉత్త సత్తెకాలపు మనిషి.' అంటూ చెప్పబోతూండగానే రాజుగారు ఆపుదల లేకుండా నా దగ్గర ఇవి వున్నాయి, అవి వున్నాయి. నేనిలా కష్టపడ్డాను అలా కష్టపడ్డాను. నాకు వాళ్లు తెలుసు, వీళ్లు తెలుసు అని ఏకరువు పెడుతూంటే అతిశయోక్తులు చెబుతున్నారేమో అనిపించింది. తీరా ఆయన ఇంటికి వెళ్ళి ఆయన నాణేల సేకరణలు చూసేటప్పటికి కళ్లు తిరిగి పోయాయి. ఆయన తన గురించి డబ్బాలు కొట్టలేదు, చాలా తక్కు వగా చెప్పుకున్నారనిపించింది. ఆయన ఇల్లే ఓ పురావస్తు ప్రదర్శన శాలగా అనుభూతి చెందింపజేసింది.

చిన్న బోషాణం వంటి పెద్ద పెట్టె, ఆ పెట్టెలో తెలుగువారి చరిత్రతో కలగలిపి భారతదేశ చరిత్ర ఆధునిక పద్ధతుల్లో భద్రపరచ బడింది. నాణేలు చూపెట్టే చరిత్ర ఆ పెట్టెలో పట్టి వుంది.

"ఇందులో ఇది శాలంకాయనుల అపురూపనాణెం. ఇది సిరిముకుని అంటే శ్రీముఖుని నాణెం. ఇది శాతవాహనుల నాణేలు. ఇవి చాలుక్యులవి, ఇవి కాకతీయులవి, ఇవి విష్ణు కుండినులవి, ఇలా చూడండి ఇది తెలుగక్షరాలున్న నాణెం. ఇది రాజరాజనరేంద్రుడు వేసిన బంగారు నాణెం. ఇవి ముస్లిమ్ పరిపాలకులు వేసినవి. ఇవి స్వాతంత్ర్యం వచ్చాక వేసుకున్న నాణేలు, ఇవి కమ్మెమోరేటివ్ కాయిన్స్ – అంటే స్మారక నాణేలు, అదిగో అవి బ్రిటిషు వారు వేసిన నాణేలు...", అంటూ మధ్యలో మనం వేసే ప్రశ్నల్ని పట్టించు కోకుండా...కాశీపట్నం చూడరబాబూ అన్న చందాన నాణేల చరితం చూడరబాబూ అన్నట్లు ఏకబిగిన తన నాణేల చారిత్రక పూర్వా పరాలను విప్పి చెప్పేవారు. అప్ప చెప్పేవారు.



కనువెలుగు : 11-11-1933 కనుమరుగు : 6-10-2019

దేనినైనా ఉద్యమంగా భావిస్తే పత్రికలు, రచనలు, ప్రచారం అన్నీ చాలా ముఖ్యం. కందుకూరి, గురజాడ, గిడుగుల సంస్కరణ, సాహిత్య భాషా భావజాలాన్ని ప్రజలకు దగ్గర చేయడంలో కమ్యూనిష్టు ఉద్యమాల పాత్ర మరచిపోగలమా?

కొమ్మదాటడం (శాఖాచంక్రమణం) అవుతోందేమో! రాజుగారి నాణేల సేవకు కొంత ప్రచారం అవసరమనిపించింది. తొట్ట తొలుతగా రాజమండ్రి పత్రికల్లో కాలనాళిక వంటి సమాచారం దినపత్రికలో 'అనగా అనగా ఒక రాజు కథ' అనే వ్యాసం రాశాను. తరువాత ఇలా ఇలా కొన్ని పత్రికల్లో పేరుతో, కలం పేర్లతో ఆయన సేకరణల గురించి, రాశాననే వాస్తవాన్ని దాచుకోలేకపోతున్నాను. చిత్రమైన అంశం ఏమిటంటే నాణేల రాజాగారి దగ్గర కేవలం నాణేలే కాకుండా నాణ్యవాఙ్మయ గ్రంథాలుండేవి.

ఒక్కొక్కప్పుడు నాణేలపై ఆయన ఆంగ్ల గ్రంథాలు కొనడం; నేను చదువుకొనడం జరిగేది. అమెరికన్ నాణేలపై ఇంతింతలావుపాటి గ్రంథాలు సైతం ఆయన కొని దాచేవారు.

నాణ్యశాస్త్రం. ఒక గొప్ప శాస్త్రం ఆ శాస్త్రంపై పట్టు సాధించాలంటే చరిత్ర, భూగోళం, భాష, లిపిజ్ఞానం, చిత్రకళ, లోహ శాస్త్రంవంటివాని పరిజ్ఞానఅధ్యయనం తప్పనిసరి. తెలుగుభాష ప్రాచీన తను గ్రహించడంలో నాణేలు, శాసనాలు పాత్ర మామూలుది కాదు.

**రాజుగారి నాణేల సేకరణ దొడ్డది. ఒకే రకమైన నాణేలు**

డా. పాపినేని శివశంకర్
8978012323

# కవితాపయోనిధి దాశరథి

'మనిషి మనసును గెలుచు మాట నారాధింతు
మాట లోపలి వజ్ర మర్యాద నెంతు'

ఒక సాహిత్య సభ. గుంటూరులో. నేను అధ్యక్షుడిని. సభ ప్రారంభంలో ఖమ్మం నుంచి వచ్చిన గొప్ప గాయని బేగం ఒక గేయం ఆలపించింది.

'ఆ చల్లని సముద్రగర్భం దాచిన బడబానలమెంతో
ఆ నల్లని ఆకాశంలో కానరాని భాస్కరులెందరో'

గేయం చివర 'గాయపడిన కవి గుండెలలో రాయబడని కావ్యాలెన్నో' అనేటప్పటికి నా గుండె చిక్కబట్టినట్టయ్యింది. ఇది గదా కవిత్వం అంటే! ఇది గదా గాఢమైన భావం యొక్క సాంద్రమైన వ్యక్తీకరణ అంటే!

ప్రకృతిని ఊతంగా చేసుకొని మొదలు పెట్టి ప్రపంచ పరిణామాలెన్నో అభ్యుదయ దృక్పథంతో వ్యాఖ్యానించిన గేయం కదా అది. రాజుల కీర్తనలతోనే ప్రాచీన కావ్యాలు, చరిత్రలు నిండిపోయాయి. అది చూసి వెగటు పుట్టటం చేతనే సామ్రాజ్యపు దండయాత్రలో సామాన్యుల సాహసమెట్టిది? అని ప్రశ్నించాడు శ్రీశ్రీ. ఆ భావాన్ని మరింతగా చిక్కబరుస్తూ 'ఒక రాజును గెలిపించుటలో ఒరిగిన నర కంఠాలెన్నో' అన్నాడు దాశరథి. (ఒరిగిన నర దేహాలెన్నో అంటే బాగుండేదేమో. కంఠం ఒరగదు, దేహమే ఒరుగుతుంది.)

'ఆ నల్లని ఆకాశంలో కానరాని భానువులెందరో' అని తొలి పాఠం. మెరుగు పెట్టిన మలి పాఠంలో 'భాస్కరులెందరో' అయింది. ఇదే బాగుంది సరళంగా.

గుంటూరులో చదువుకొనే రోజుల్లో నవోదయలో దొరికిన పుస్తకం 'కవితా పుష్పకం'. భావస్ఫోరకమైన బాపు రేఖా చిత్రాలతో అలంకరింపబడిన కవితలు. ఆ బొమ్మలు చూసి గీస్తూ, ఆ కవితలు మననం చేసుకుంటూ గడిపిన రోజులు. మీరు చదివారో లేదో, అందులో 'స్నేహగీతి' ఒక్కసారి వినండి.

'తైలాలు లేకుండ వెలిగేటి దీపం
విద్యుత్తు లేకుండ వెలిసేటి దీపం
హృదయాలలో ఎపుడు నిలిచేటి దీపం
నిజమైన దీపం మా స్నేహ దీపం
మనసులో దీపం మలిపితే పాపం'

ఇలా చెపుతున్నపుడు దీపం అనేది కాంతికే గాక అంతః చైతన్యానికి సంకేతమని అర్థమవుతుంది. ఆ చెలిమి దివ్వెను ఎంత భద్రంగా కాపాడుకోవాలో అర్థమవుతుంది.

'మిత్రుడే కావాలి సుఖమున శోకాన
అతడు లేకున్నచో నగరమే కాన'

గేయానికే మకుటాయమానమైన వాక్యాలివి. స్నేహ పరిమళం




కనువెలుగు : 2 జులై 1925
కనుమరుగు : 5 నవంబర్ 1987

గురించి ఇంత చిక్కగా రాసిన మరో గేయం-ఏదీ నాకిప్పటికి తగల్లేదు.

'కవితా పుష్పకం' లోని కవితల శీర్షికల్ని 'తలకట్లు' అన్నాడు కవి. పేజీలను 'పొరటలు' అన్నాడు. ఇదీ బాగుంది.

భారత చైనా యుద్ధం ముగిసింది. మన దేశం గెలిచిందా, ఓడిందా అనేది వేరే సంగతి. యుద్ధం అన్ని అందాల భీకర సందర్భం. అది మనుషుల్లో దాగి ఉన్న వీరత్వంతో-పాటు క్రూరత్వాన్ని కూడా నిద్ర లేపుతుంది. రక్తంలో సూర్యోదయం చూస్తుంది. నేల మీద ఎనభై నాలుగు లక్షల జీవరాశులలో మనుషులు మాత్రమే యుద్ధాలు చెయ్యగలరు. శతఘ్నులపై ప్రేమగీతాలు అల్లగలరు. ఆ యుద్ధ సందర్భంలో ఎంతో మంది ప్రసిద్ధ కవులు దేశభక్తితో ఆవేశం పొర్లిన కవితలు రాసిన సంగతి మనకు తెలుసు. అయితే యుద్ధానంతర దృశ్యాన్ని దాశరథి సంతోషంగా వర్ణించాడు, ఇదుగో ఇలా -

'సైనికుని శిరస్త్రాణంలో
సాలీడల్లిన గూడు
శుభం చెబుతున్నది
మరఫిరంగిలో

తిరగమోత

సడ్లపల్లె చిదంబరరెడ్డి
9440073636

# కాలజ్ఞానం అందేదెన్నడు....??

కాలజ్ఞానం అంటే అదేదో పోతులూరి వీరబ్రహ్మం చెప్పిన ఎప్పుడో జరగబోయే ఊహాతీత సంఘటనల గురించికాదు. ఒక కాలంలో బతుకుతున్న.... బతకాల్సిన కొత్త తరానికి ఆ కాలం గురించిన ఆధునిక జ్ఞానం ఎంతవరకు అందుతున్నది?? అన్నదే నా సందేహం!!

ఒక ఉదాహరణ తీసుకొందాం. నేను డెబ్బయ్యవ దశకంలో కళాశాల విద్యార్థిని. తెలుగు నాకు ముఖ్యమైన విషయం అను కొంటే....సంబంధిత ఉపన్యాసకులు పాఠాలు చెబుతూ, వారు ఇష్టపడే పద జాలాన్ని, కవులను, గ్రంథాలను గురించే చెప్పే వారు. ఆ పుస్తకాలూ భావజాలం వారికెలా నచ్చాయి??? అంటే అంతకు ఇరవై యేళ్లకు ముందు వారు చదివే రోజుల్లో వారి గురువులు తాము మెచ్చిన, తాము ఆరాధించే వాటినే వీరికి బోధించి ఉంటారు. అప్పటి వారుకూడా తాము నివసిస్తూ అనుభవించే సమాజం గురించి ఏ మాత్రం స్పృహలేక వారి పూర్వ గురువులు బోధించిన దాన్నే అనుసరించి ఉంటారు.

ఈ అనుమానం నాకు ఎందుకు వచ్చిందంటే...డెబ్బయ్యవ దశకంలో నా కళాశాల చదువులో రామాయణము, మహ భారతము, ప్రబంధాలు, శతకాలు, వేదాలు, ఉపనిషత్తులు వాటి గొప్ప తనము ఆ మహాగ్రంథాలను రాసిన వారి గురించే గురువుల నుంచి విన్నాను కానీ......అప్పటి కాలంలో విరివిగా వస్తున్న కథానికలు, నవలలు, భావకవిత్వం, అభ్యుదయ కవిత్వం వంటి పేర్లే విని ఉండలేదంటే నమ్మండి!! విరామ సమయంలో లైబ్రరీకి వెళితే, వారపత్రికల్లో ఏవో సీరియళ్ళు, కథలు, శ్రీ శ్రీ, సి.నారె, గుంటూరు శేషేంద్ర శర్మ వంటి పేర్లతో అచ్చయిన వాటిని అవి నాకెందుకూ పనికిరావన్న భావంతో దినపత్రికల్లోని వార్తల్లా మాత్రమే తిరగేసేవాడిని.

తెలుగుభాషా పదజాలానికి సంబంధించికూడా నేను రోజూ సమాజంలో వ్యవహరించే పదాలకూ, పుస్తకాలు చదివి గుర్తుపెట్టుకొని రాయాల్సిన పదాలకూ చాలా చాలా తేడా ఉండేది!! ఈ అంతరం ఎందుకుందో? ఉండాల్సిన అవసరం ఏమిటో కనీసం సూచాయగా అయినా చెప్పేవారు లేరు.

నేను మూడో తరగతి చదివే సమయంలో (1963) తంజావూరు, సామర్లకోట అనే పేర్లతో పాఠాలుండేవి. అవి కూడా నేనున్న సమాజంలో నిత్యజీవితంలో వ్యవహరించే పదజాలం కాకుండా మరో రకంగా ఉండేవి. సినిమాలు చూసినా, కథలు చదివినా రోజువారీ వ్యవహారాల పదాలు కాకుండా అసహజమైన భాషా వంగడాలు. నా చుట్టూ కనిపించే పాత్రలు కానీ, నా ప్రాంతపు జన సమూహ నివాసాల పేర్లు కానీ కనిపించక వినిపించక పోవడం పెద్ద వెలితిగా అనిపించేది.

ఈ వెలితిని పూడ్చుకోవటానికి నాకు మరో యాభై యేళ్లు పట్టింది. కారణం ఊపిరి సలపనీయని, మరో ఆలోచనకు తావివ్వని అనారోగ్యంతో సతమతం కావడమే!!

1994 ఆ ప్రాంతంలో కోగిర జై సీతారాం అనే ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయున్ని కలిసిన సందర్భంలో అతను తాను నివసించే ప్రాంతపు పదజాలంతో పిల్లలకు రాసిన పాటలు, చేసిన కృషి తెలుసుకొనడం జరిగింది.

అప్పటి నుంచి నా విద్యార్థులకు నేను నా గురువుల నుంచీ నేర్చుకొన్నది కాకుండా పిల్లల నిత్యవ్యవహారాల పదజాలము, అక్కడి జీవితాలవల్ల వచ్చే సమస్యలను గురించిన వాటితోనే బోధించడం మొదలు చేశాను. దానివల్ల పిల్లల్లో చాలా మార్పును గమనించాను.

కాలానుగుణ మైన మార్పును దృష్టిలో పెట్టుకొని పాఠశాల యాజమాన్యం తరచూ ఉపాధ్యాయులకు పునశ్చరణ తరగతుల్ని నిర్వహిస్తున్నదని మీరు అనవచ్చు. కానీ అవి శాస్త్ర, సాంకేతిక, గణిత వగైరా వాటిలోనే జరుగుతున్నదికానీ - 80 శాతానికి పైగా గ్రామీణ ప్రాంతాల్లో నివసించే ప్రజలు, వారి పిల్లల భాషా పదజాలం గురించి కాదని ఉపాధ్యాయుడిగా నా అనుభవం.

అదే విధంగా మన ఆలోచనల్నీ, ఆధునిక మైన వ్యవహారిక భాషా యాసల్నీ(వేరు పోయాక తెలంగాణా ప్రజల సహజ ఉచ్చారణా రీతులు గమనించండి) మార్చుకొందామని ఎందుకు అనుకోకూడదు? శాస్త్రవేత్తలు ఆధునిక భాషకు ఇచ్చిన నిర్వచనం ఏమిటంటే "నిత్యం వ్యవహరించేదీ....రాసేదీ ఒకటే కావడం" అని. కాబట్టి ఈ ద్విపాత్రాభినయాల రెండు ఉచ్చారణల తెలుగునూ భావజాలాన్నీ కాకుండా, ఇప్పటికిప్పుడు వ్యవహారంలో ఉన్న అమ్మనుడుల్నీ, సహజత్వాన్నీ ఈ తరం పిల్లలకు అందిస్తూ, తాజాగా ఎదగడానికి బతకడానికి అవకాశం ఇవ్వాల్సిన అవసరం ఎంతో ఉంది. ఇది ప్రపంచంలోని అన్ని భాషలకూ వర్తిస్తుంది. (వ్యాసకర్త విశ్రాంత తెలుగు ఉపాధ్యాయుడు. ప్రముఖ కథా రచయిత, కవి)

అ

## స్పందనను వ్రాయండి

**'అమ్మనుడి'**లో రచనలపై
మీ స్పందనను వ్రాసి పంపండి!
సంపాదకుడు **'అమ్మనుడి',**
జి-2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ, హిందీ కళాశాల వీధి,
మాచవరం, విజయవాడ-520 004.
ఇ-మెయిల్ : *editorammanudi@gmail.com*

-సంకేపల్లి నాగేంద్రశర్మ
80748 26371.

# రామప్ప గుడులకు ఈసారైనా యునెస్కో హెరిటేజ్ గుర్తింపు దక్కేనా?




తెలంగాణా రాష్ట్రంలోని ప్రఖ్యాతి గాంచిన రామప్ప గుడులకు ఈ సారైనా యునెస్కో వారి ప్రపంచ వారసత్వ సంపద కట్టడాల జాబితాలో గుర్తింపుకు నోచుకోనున్నదా అన్న విషయమై సందేహాలు అవసరం లేదు. ఇందుకు సంబంధించిన నేపథ్యపు పనిని విజయవంతంగా పూర్తి చేసినట్లు, ఇక నిర్ణయం యునెస్కో వారు నిర్ణయం తీసుకోవడమే ముందున్న బృహత్కార్యమని తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వ పురావస్తు శాఖధికారులు, కేంద్ర సర్వేక్షణా అధికారిక కార్యాలయం, హైదరాబాద్ శాఖ అధికారులు అంటున్నారు. వీరు గుర్తింపు వస్తుందన్న సరైన ధీమాలో ఉన్నారు.

2017 వ సంవత్సరంలో రామప్పకు రావాల్సిన గుర్తింపు ఆఖరి క్షణంలో ఆగిపోయింది. సరైన వివరాలు లేవంటూ, యునెస్కో కమేటీ వారు నివేదికను త్రిప్పి పంపడంతో, యునెస్కో కన్సల్ టెంట్, రచయిత్రి, ప్రముఖ నాట్యకారిణియైన చూడామణీ నందగోపాల్ ఇక్కడి దేవాలయ నృత్య శిల్పాలపై పరిశోధించి, నివేదికను రూపొందించారు. క్రీ.శ. 1250లో గణపతి దేవ చక్రవర్తి బావమరిది జాయప సేనాని ఇక్కడి గుడుల శిల్పరీతులను పరిశీలించి, నృత్యరత్నావళీ అనే గ్రంధాన్ని రాశారు. అలాగే ప్రముఖ నాట్యాచార్యుడు పద్మశ్రీ నటరాజ రామకృష్ణ గారు, ఇక్కడి శిల్పాలను అధ్యయనం చేసి, పేరిణి శివతాండవం, లాస్య నర్తనం అనే రెండు నృత్య ప్రక్రియలకు జీవం పోశారు. 2017 వ సంవత్సరంలో రామప్ప గుడుల శిల్పాలకు వారసత్వ గుర్తింపు రావడానికి పెద్ద ఎత్తున ప్రయత్నాలను తెలంగాణా ప్రభుత్వం చేసింది. అప్పటి రాష్ట్ర టూరిజం, పురావస్తు శాఖల మంత్రి అజ్మీరా చందూలాల్ గారు ప్రత్యేక శ్రద్ధాసక్తులను తీసుకొన్నారు. న్యూఢిల్లీ వరకు వెళ్ళి కేంద్ర పురావస్తుశాఖ మంత్రిని కలిసి విన్నవించుకున్నారు. యునెస్కో హెరిటేజ్ గుర్తింపు పొందిన కట్టడాలు ఉభయ తెలుగు రాష్ట్రాలలో ఎ ఒక్కటి ఇంత వరకు నోచుకోక పోవడం గమనార్హం. పెద్ద లోపంగా ఇక్కడి పురావస్తు నిపుణులు భావిస్తున్నారు. పొరుగు రాష్ట్రాలైన కర్నాటక, తమిళనాడులోని హంపి, హాలిబేడు, తంజావూర్ వంటి పలు దేవాలయాలు యునెస్కో గుర్తింపుకు నోచుకున్నాయి. మొన్నటికి మొన్న మన ప్రధానమంత్రి మోడి గారు యునెస్కో గుర్తింపు పొందిన పల్లవుల కట్టడాలైన మహబలిపురం దేవాలయాల్లోని మండపాలను, శిల్పాలను, పాండవుల రథాలను చూస్తూ, చైనా అధ్యక్షుడు జీపింగ్ తో రెండు రోజుల పాటు సమావేశమైన విషయం మీడియాలో పతాక శీర్షికలతో ప్రచారం జరిగిందే.

రామప్ప గుడులని, ఇక్కడి శిల్ప కళా వైభవాలను యునెస్కో ప్రతినిధుల బృందం వారు సెప్టంబర్ 25, 26 తేదీలలో రెండు రోజులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ వివిధ శాఖల బృందాలతో అధికారికంగా పర్యటించి వెళ్ళారు. కట్టు దిట్టమైన బందోబస్తు ఏర్పాట్ల మధ్య ప్రతినిధుల బృందం రెండు రోజుల రామప్ప గుడుల పర్యటన, పరిశీలన ముగిసింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో కాకతీయ శిల్పకళావైభవం అంతా ఇంతా కాదు. రామప్పతో పాటు, హన్మకొండ, వేయి స్తంభాల గుడి, ఓరుగల్లు కోట వంటి హెరిటేజ్ కట్టడాలున్నాయి. జిల్లాల పునర్ వ్యవస్థీకరణలో భాగంగా, ములుగు నూతన జిల్లాలోకి రామప్ప గుడులు చేరి పోయాయి. ప్రస్తుతం వెంకటాపురం మండలం పాలంపేట గ్రామంలో రామప్ప గుడులు వున్నాయి. రామప్ప గుడుల శిల్పకళా వైభవాలతోపాటు, మరో పద్దెనిమిది గుళ్ళను రామప్ప గుడుల పరిధిలోకి తెచ్చారు. ప్రఖ్యాతి గాంచిన రామప్ప సరస్సు కూడా ఇందులో చేర్చారు. సరైన నిర్వహణ లేక పోవడం వల్ల, క్రమేపీ ఈ గుడులు, దీని ఉపాలయాలు శిథిల దశకు చేరుకున్నాయి. కాటేశ్వర, కామేశ్వర ఆలయాలు సైతం శిథిల దశలోనే ఉన్నాయి. ప్రఖ్యాతి పొందిన రామప్ప నందికి ఇంతవరకు రూఫ్ వంటి రక్షణ, సరైన అదరణ లేకుండా పోయింది. అయినప్పటికినీ ప్రఖ్యాతి గాంచిన కాకతీయ శిల్పాలు ఎనిమిది వందల ఏళ్ళు గడిచినా నాజూకుతనం పోకుండా ఆకర్షిస్తుండటం అందరినీ అబ్బురపరుస్తోంది. నల్ల రాతితో చెక్కిన రామప్ప శిల్పాలు అద్దం వంటి నునుపుతో మెరుస్తు వుండటం దీని ప్రత్యేకతలని చెప్పవచ్చును. తెలంగాణా ఉద్యమ సమయంలో దేవాదుల సొరంగ నిర్మాణాదుల కొరకు జరిగే బ్లాస్టింగ్‌లు, పేలుళ్ళ నుండి రక్షించడానికి 2011 లో తెలంగాణా మేధావులు, ఉద్యమకారులు, చరిత్రకారులు ఆచార్య జయధీర్ తిరుమలరావు, అమ్మనుడి సంపాదకులు డా.సామల రమేష్ బాబు, డా.ఈమని శివనాగిరెడ్డి, డా.చుక్కా రామయ్య , విమలక్క, సంకేపల్లి నాగేంద్రశర్మ, ఆచార్య సూరపనేని సుజాత తదితరుల సారధ్యంలో ఒక ఏడాదిన్నర పాటు ఉద్యమించి, విజయ సంకేతంగా పదివేల దివ్వెల జాతరా జరుపుకొని విజయం సాధించారు. జూన్ 17, 2012 న రామప్పలో దివ్వెల జాతరా జరిగింది. 2013 లో రెండు సార్లు 800 సంవత్సరాల రామప్ప గుడుల స్థాపనోత్సవం జరిగింది.

యునెస్కో హెరిటేజ్ ప్రతినిధి థాయిలాండ్ దేశానికి చెందిన వాసు పోశ్యానంద, ఆర్కియాలోజి సర్వే ఆఫ్ ఇండియాకు చెందిన

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Ammanudi+November+2019**

* * *